www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 07 | నవంబర్ | 2025
పేజీలు : 8

## దొంగతనానికి వచ్చి.. పోలీసులకు చిక్కి...



2లో

### 12న జరిగే మెగా జాబ్ మేళాను

# సద్వినియోగం చేసుకోవాలి





- అన్ని ప్రభుత్వ శాఖలు సహకరించాలి
- విజయవంతానికి అంతా భాగస్వాములు కండి
- హాజరుకానున్న డిప్యూటీ సిఎం భట్టి
- ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : సింగరేణి సంస్థ సౌజన్యంతో ఈనెల 12న కొత్తగూడెం క్లబ్‌లో జరిగే మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని, ఈ జాబ్ మేళా ప్రారంభోత్సవానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హాజరు కానున్నారని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివ రావు అన్నారు. గురువారం స్థానిక కొత్తగూడెం క్లబ్‌లో జాబ్ మేళా సన్నాహక సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ సింగరేణి కాలరీస్ సంస్థ సౌజన్యంతో కొత్తగూడెం కేంద్రంగా జరిగే ఈ జాబ్ మేళాకు 50కి పైగా కంపెనీలు హాజరవుతున్నాయని చెప్పారు. జిల్లా నలు మూలల నుండి 10 వేల మందికి పైగా హాజరయ్యేలా జిల్లాలో ఉన్న అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని సూచించారు. మూడు వేలకు పైగా ఉద్యోగాలు కల్పించేందుకు నిర్వహిస్తున్న జాబ్‌మేళా నిరుద్యోగల పాలిట వరంగా మారుతుందని,

మిగతా 2లో..

## ఇంటింటికి శతాబ్ధి సంబర పిలుపు




-డిసెంబర్ నుంచి సభలు, సెమినార్లు
- సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో బాగం

ప్రజాపక్షం/ ఖమ్మం : భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవ ముగింపు సందర్భంగా డిసెంబర్ 26న జరిగే ప్రదర్శన, బహిరంగ సభ కార్యక్రమాల సమాచారాన్ని ఇంటింటికి అందించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. శతాబ్ది ఉత్సవ ముగింపు సభ ప్రచారాన్ని ఒక ఉద్యమంలా నిర్వహించాలని యావన్మంది పార్టీ సభ్యులు , సానుభూతి పరులను ప్రచార కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని ఆయన కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం గురువారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో మహ్మద్ సలాం అధ్యక్షతన జరిగింది. సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ చరిత్రను, పోరాటాలను ప్రజల పక్షాన సాధించిన

మిగతా 2లో..

## మద్యం షాపుల ఏర్పాటుపై బేరసారాలు



ప్రజాపక్షం/వైరాః ఖమ్మం జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపు లాటరీ పద్ధతిలో పూర్తికావడంతో కొత్తగా మద్యం షాపులు దక్కించుకున్న వారితో మద్యం వ్యాపారులు బేరసారాలు పెద్ద ఎత్తున దిగారు. మద్యం షాపులు దక్కించుకున్న వారికి ఆఫర్లు ఇస్తూ మీకు డబ్బు ఎంత కావాలి చెప్పండి మాట్లాడుకుందాం. షాపు మాకు ఇస్తారా అంటూ ప్రలోబాలకు గురిచేస్తున్నట్లు సమాచారం. గతంలో మద్యం షాపుల్లో ఉండి ఈసారి జరిగిన మద్యం షాపుల లాటరీలో షాపులు దక్కని వారు మరల ఎలాగైనా మద్యం దుకాణాలను వారి చేతికి దక్కించుకొని రంగంలో ఉండేందుకు రకరకాల ప్రయత్నాలు రాయబారాలు చేస్తున్నారు. కొత్తగా మద్యం

-సిండికేట్‌పై ప్రత్యేక దృష్టి
-బెల్ట్ దందాపైనే అందరి ఆశలు

షాపులు దక్కించుకున్న వారితో సిండికేట్లు వ్యాపారులు మంతనాలు కొనసాగుతున్నారు.

**ఒక్కొక్క షాపుకు రూ.80లక్షల నుంచి కోటి రూపాయల వరకు..?**

ఖమ్మం జిల్లాలో మద్యం దుకాణాలకు ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన లక్కీ డ్రాలో గత కొన్ని సంవత్సరాల నుంచి మద్యం వ్యాపారంలో ఉన్న సిండికేట్ వ్యాపారస్తులు

మిగతా 2లో..

### పోష్, పోక్సో చట్టాలపై

# అవగాహన కలిగి ఉండాలి




-ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ శ్రీజ

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : పోష్ చట్టం 2013, పోక్సో చట్టం 2012 చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డా।। పి. శ్రీజ తెలిపారు. ఖమ్మం నగరంలోని శ్రీ భక్త రామదాసు కళాక్షేత్రంలో గురువారం ప్రభుత్వ, ప్రైవేటు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కళాశాలల ప్రిన్సిపాళ్లకు పోష్, పోక్సో చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ కలెక్టర్ శ్రీజ పాల్గొని మాట్లాడుతూ ఉద్యోగ స్థలాల్లో మహిళలు రక్షణ కలిగి ఉండేందుకు పోష్ చట్టం రూపొందించబడిందని, లైంగిక వేధింపులకు గురైన మహిళలకు ఫిర్యాదు చేసేందుకు అంతర్గత కమిటీలు,జిల్లా స్థాయి కమిటీలను

మిగతా 2లో..

# 12న జరిగే మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

**(మొదటిపేజీ తరువాయి)**

ఆర్థికంగా స్థిరపడేందుకు అవకాశం ఉంటుందన్నారు.10వ తరగతి పాస్ అయిన వారి నుండి మొదలుకుని ఇంజనీరింగ్, డిప్లొమా, ఫార్మసీ, ఎంబిఏ, ఎంసిఏ, పోస్టుగ్రాడ్యుయేట్, బిఇ, బిటెక్, ఎంటెక్, గ్రాడ్యుయేట్ తదితర చదువులు చదివిన వారంతా ఈ జాబ్‌మేళాలో ఉద్యోగాలు పొందేందుకు హాజరుకావచ్చని చెప్పారు. కనీసం రూ.13 వేల నుండి మొదలుకుని రూ.10 లక్షల నెలకు ప్యాకేజీతో జీతాలు వచ్చే అవకాశం ఉందని, దిగ్గజ సాఫ్ట్‌వేర్, ఫార్మసీ కంపెనీలతో పాటు పలు కంపెనీలు వస్తున్నాయని చెప్పారు. జాబ్ మేళాకు హాజరయ్యేందుకు ముందుగా రిజిష్ట్రేన్ చేయించుకోవాల్సి ఉంటుందని, క్యూఆర్ కోడ్ ద్వారా కూడా ఆన్‌లైన్ రిజిష్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు ఉందన్నారు. ఆన్‌లైన్ రిజిష్ట్రేషన్ చేసుకోవడం వీలుకాని వారు కూడా నేరుగా హాజరై స్పాట్ రిజిష్ట్రేషన్ చేసుకుని జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని, ఒక్కొక్క అభ్యర్ధి కనీసం 5 కంపెనీలు నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు అయ్యే విధంగా టోకెన్ పాస్ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని, ఉద్యోగానికి అభ్యర్ధులు ఎంపికైన వెంటనే అక్కడికక్కడే ఆయా కంపెనీలు ఉద్యోగం కల్పిస్తున్నట్లు ఒప్పంద పత్రాలను కూడా ప్రముఖుల చేతుల మీదుగా అందిస్తారని చెప్పారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ జాబ్‌మేళాలో జిల్లాలోని 40 ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది విస్తృత ప్రచారం నిర్వహించాలని, అధికారులు ఇందుకు సంబంధించి ఓ ప్రణాళిక ప్రకారం ముందుకు సాగాలన్నారు. అనంతరం జాబ్‌మేళాకు చెందిన పోస్టర్‌ను విడుదల చేశారు. తహశిల్దార్ పుల్లయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మురళీధర్, సింగరేణి ఎస్ఓ2 జిఎం కోటిరెడ్డి, ఏజిఎం (సివిల్) రామకృష్ణ, డిజిఎం (పర్సనల్) మోహన్ రావు, ఎస్టేట్ ఆఫీసర్ తావుర్య, జాబ్‌మేళా కో ఆర్డినేటర్ చందర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, ఆర్‌డిఓ మధు, కార్పోరేషన్ కమీషనర్ సుజాత, డిఎస్‌పి రెహమాన్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, గుర్తింపు సంఘం నాయకులు వట్టికొండ మల్లిఖార్జునరావు, నాయకులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, చలిగంటి శ్రీనివాస్, చంద్రగిరి శ్రీనివాసరావు, జి వీరస్వామి, తహశిల్దార్లు, ఎంపిడిఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మద్యం షాపుల ఏర్పాటుపై బేరసారాలు

**(మొదటిపేజీ తరువాయి)**



వందల సంఖ్యలో దరఖాస్తు చేశారు. అయితే గతంలో షాపులు దక్కించుకున్న వారికి ప్రస్తుతం షాపులు పెద్ద ఎత్తున దక్కలేదని తెలుస్తుంది. ఈ నేపధ్యంలోనే లక్కీడ్రాలో మద్యం షాపులు దక్కించుకున్న వారితో మంతనాలు జరుపుతున్నారు. ఒక్కొక్క షాపుకి ఆ ఏరియా వ్యాపారాన్ని బట్టి రూ.80లక్షల నుండి కోటి రూపాయల వరకు గుడ్‌విల్ ఇస్తామని ఆఫర్లు ఇస్తున్నట్లు సమాచారం. అయితే ఈ ఆఫర్లకు లొంగుతారా అనే దానిపై కూడా కొంత క్లారిటీ రావాల్సిన అవసరం కూడా ఉంది.

**సిండికేట్ ప్రయత్నాలు**

మద్యం దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు గుడ్‌విల్ ఇచ్చి కొనుగోలు చేసిన వారు పెట్టిన డబ్బులు రాబట్టుకునేందుకు సిండికేట్‌కు ప్రయత్నిస్తున్నట్లు జిల్లావ్యాప్తంగా తెలుస్తూ ఉంది. అయితే ఇప్పటికే వారి మధ్య ఉన్న సంబంధాలు సిండికేట్ వ్యాపారులు మధ్య పలువురు మద్యం వ్యాపారులు ఒక ఒప్పందానికి వచ్చినట్లు సమాచారం. అయితే బెల్టు షాపులు పెద్ద ఎత్తుగా ప్రోత్సహించి అధిక ధరలకు విక్రయించాలని చూస్తున్నట్లు సమాచారం.

**ఒక్కొక్క ప్రాంతంలో ఒకలా**

ఖమ్మం జిల్లావ్యాప్తంగా మద్యం షాపుల వ్యవహారంలో సిండికేట్‌గా ఏర్పడినట్లు తెలుస్తూ ఉంది. అయితే ఎక్కడ ఎలాంటి గొడవలు చోటు చేసుకోకుండా పేరుకే కొన్నిచోట్ల ఎంఆర్‌పికి మద్యాన్ని విక్రయించేటట్లు తర్వాత అందరూ కలిసి ఆయా ప్రాంతాల్లో గొడౌన్లను ఏర్పాటు చేసుకొని అక్కడ నుంచి బెల్టు సామ్రాజ్యాన్ని కొనసాగించేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. డిసెంబర్1 నుండి కొత్త మద్యం దుకాణాలు ప్రారంభంకానున్న నేపధ్యంలో బెల్టు షాపుల ద్వారా ఒక్కొక్క క్వార్టర్ బీర్లపై అడ్డంగా రూ.20ల నుంచి రూ.30లు తీసుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. ఇదిలా ఉంటే జిల్లావ్యాప్తంగా అడుగడుగునా బెల్టు షాపులు విచ్చలవిడిగా ఉంటున్నాయి. అయితే కొంతమంది బెల్టు షాపులు నిర్వాహకులు మద్యం షాపు నుంచి ఎంఆర్‌పికి మద్యాన్ని కొనుగోలు చేసి విక్రయిస్తారు. అయితే అలాంటి వారిపై ప్రత్యేక బృందాలు తనిఖీలు చేసేవిధంగా కూడా ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. అయితే ఇక మందుబాబులు జేబులకు చిల్లులు పడ్డట్టే.

**వైరా మండలంలో షాపులు ఏర్పాటు**

వైరా మండలంలో మొత్తం ఐదు వైన్‌షాపులు లక్కీడ్రాలో మద్యం వ్యాపారులు తగ్గించుకున్నారు. వైరా మున్సిపాలిటీలో పాత సెంటర్ ఒకటి, రింగు రోడ్డు 1, మధిర రోడ్డులో 1, వైరా మండలంలో రెబ్బవరం ఒకటి, దాచాపురం ఒకటి షాపులు ఏర్పాటును మద్యం షాపులు దక్కించుకున్న వారు ఏర్పాటు చేయనున్నారు. ఈ క్రమంలోనే బెల్టు వ్యాపారంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తుంది. అయితే వైరా మండలంలో మద్యం వ్యాపారుల మధ్య ఇంకా ఒక ఒప్పంద క్లారిటీ రాలేదని తెలుస్తుంది. ఒకవేళ ఒప్పందం సిండికేట్ కుదరదన్న పక్షంలో రెండు సిండికేట్లుగా ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి.

# ఖమ్మంలో రెండు రోజులు ఎల్ఐసిఏఓఐ సమావేశాలు

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మంలో ఈనెల ఎనిమిది, తొమ్మిది తేదీల్లో ఎల్ఐసిఏఓఐ (ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా) 6వ సౌత్ సెంట్రల్ జోన్ సమావేశాలు జరగనున్నట్లు ఆలిండియా కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. మంజునాథ్ తెలిపారు. గురువారం జరిగిన మీడియా సమావేశంలో మంజునాథ్ మాట్లాడుతూ ఎల్ఐసిని కాపాడటంతో పాటు పాలసీదారులు, బీమా ప్రతినిధుల ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంతో ఎల్ఐసిఏఓఐ ప్రారంభించబడిందన్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 10 బీమా కంపెనీలలో ఎల్ఐసి మూడవ స్థానంలో ఉందని, భారతదేశంలో మొదటి స్థానంలో ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పంచవర్ష ప్రణాళికలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ, స్థానిక సంస్థల ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు, దేశంలోని అన్ని అభివృద్ధి ప్రాజెక్టుల అమలుకు అవసరమైన ఆర్థిక వనరులను ప్రభుత్వం ద్వారా రుణాల రూపంలో అందిస్తుందన్నారు. ఎల్ఐసి ప్రైవేటీకరణను ఉపసంహరించుకుని ప్రజాసేవా రంగంలోనే ఉంచాలని, పాలసీదారుల ప్రయోజనాలను కాపడటానికి రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన ఉద్యమ కార్యచరణపై ఈ సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ సహా 17 డివిజన్ల నుంచి ఎంపిక చేయబడిన 300 మంది ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ జనరల్ సెక్రటరీ పిఎల్ నర్సింహారావు, తెలంగాణ అధ్యక్షులు రాథూర్ శ్రీనివాస్, జోన్ వైస్ ప్రెసిడెంట్ నాగరత్నమ్మ, నవీన్, జోన్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్, జోన్ కమిటీ కార్యదర్శి వలీమోహినుద్దీన్, ఆఫీస్ బేరర్లు, ఆహ్వాన సంఘ ప్రచార కార్యదర్శి వి.మల్లికార్జునరావు, మందపల్లి సురేష్, ఉసికల ప్రసాద్, పి.వెంకటరమణ, రాజయ్య, బొడ్డు శ్రీనివాసరావు, జి.ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# రామన్నపేటలో అయ్యప్ప నగర సంకీర్తన

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని రామన్నపేట కాలనీలో అయ్యప్ప స్వాములు నగర సంకీర్తన నిర్వహించారు. గురువారం దీపాల వెలుగులో మేళతాళలతో మాల ధరించిన అయ్యప్ప స్వాములు నగర సంకీర్తనను నిర్వహించారు. గురుస్వామి గొలుసుల తిరుమల రావు నగర సంకీర్తనకు నాయకత్వం వహించారు. భక్తులంతా స్వామియే శరణం అయ్యప్ప అంటూ కాలనీల్లోని వీధుల్లో సంకీర్తన సాగించారు. హారతులు ఇచ్చి స్వామి వారిని జపించారు. బండి మనోజ్ ఆధ్వర్యంలో స్వాములకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో గురుస్వాములు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, తాడబోయిన రాంబాబు, బరిగల శేఖర్, చింతకాయల అంజయ్య, బండి మనోజ్, బార్ అనిల్, కట్ల నర్సింహారావు, అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.



# ఇంటింటికి శతాబ్ధి సంబర పిలుపు

**(మొదటిపేజీ తరువాయి)**

విజయాలను నేటి తరానికి తెలియజేసేందుకు గ్రామ గ్రామాన శతాబ్ది ఉత్సవ ముగింపు సందర్భంగా జరిగే ప్రచార కార్యక్రమాల ద్వారా వివరించాలన్నారు. వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమంలో ఎంతో మంది త్యాగాలు చేసిన మహానీయులు ఉన్నారని త్యాగచరితను సైతం తెలియజేయాలన్నారు. భారతదేశంలోనే బలమైన కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణం కలిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో శతాబ్ది ఉత్సవ ముగింపు సభ డిసెంబర్ 26న ఖమ్మంలో లక్షలాది మందితో జరగనుందన్నారు. వామపక్ష ఉద్యమ కేంద్రంగా పోరాటాల పురిటిగడ్డగా భాసిల్లిన ఖమ్మం స్వాతంత్ర్యానికి ముందు ఆ తర్వాత సువర్ణక్షర లిఖిత తెలంగాణ పోరాటంలోనూ కీలక భూమిక పోషించిందన్నారు. ఈ గడ్డపై నుంచి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎందరో పోరాడి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేశారని ఆయన తెలిపారు. ఉద్యమ చరితకు అనుగుణంగా డిసెంబర్ మొదటి వారం నుంచి సభలు, సమావేశాలు, సెమినార్లు ఏర్పాటు చేయనున్నట్లు హేమంతరావు తెలిపారు. రచయితలచే కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు హేమంతరావు తెలిపారు. ఖమ్మం జిల్లా నుంచి వందలాది మంది యువతీ, యువకులకు త్వరలో జనసేవాదళ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఖమ్మం నగరం సహా జిల్లాలోని అన్ని మండలాల్లో బృందాలుగా ఏర్పడి ఇంటింటికి శతాబ్ది ఉత్సవ సందేశాన్ని అందజేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాల నివేదికను దండి సురేష్ ప్రవేశపెట్టారు.

## పోష్, పోక్సో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**(మొదటిపేజీ తరువాయి)**

ఏర్పాటు చేయాలన్నారు. లైంగిక వేధింపుల సంఘటన జరిగిన 90 రోజుల్లో విచారణ పూర్తి చేయాలని చర్యల్లో నిర్లక్ష్యం వహిస్తే సంస్థలకు జరిమానాలు విధించబడతాయన్నారు. పిల్లలు లైంగిక వేధింపులకు గురికాకుండా రక్షించేందుకు పోక్సో చట్టం రూపొందించారన్నారు. దీని క్రింద పిల్లలపై లైంగిక వేధింపులు, దాడి, పోర్నోగ్రఫీ వంటి నేరాలకు కఠిన శిక్షలు ఉండటం, బాధిత పిల్లలకు వైద్య, మానసిక, విద్యా సాయం అందించే బాధ్యత ప్రభుత్వానికి ఉందని తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్‌రెడ్డి, డిసిపివో విష్ణువందన, జిసిడివో తులసీ, ఏపివో శ్రీనివాస్, బాలల సంరక్షణ జిల్లా కో ఆర్డినేటర్ సమీన్, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, అధికారులు పాల్గొన్నారు.

# దొంగతనానికి వచ్చి.. పోలీసులకు చిక్కి...

**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ పట్టణంలో ఓ ఇంటిలో దొంగతనం చేయటానికి వచ్చిన ఎనమిది మంది పోలీసులకు చిక్కిన సంఘటన గురువారం జరిగింది. ఈ మేరకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో గురువారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో డిఎస్‌పి సతీష్ కుమార్ మాట్లాడుతూ ఎస్ఐ సుమన్ తన సిబ్బందితో కలిసి బుదవారం రాత్రి పెట్రోలింగ చేస్తున్నారు. ఈ క్రమంలో స్థానిక దమ్మపేట సెంటర్ మారుతీ సుజుకీ షోరూమ్, జమ్ముల గార్డెన్ సమీపంలో కొందరు వ్యక్తులు రెండు కార్లలో అనుమానాస్పదంగా కనిపించారు. కార్లను తనిఖీ చేశారు. అందులో ఓ పదునైన కత్తితో పాటు రెండు ఇనుపరాడ్‌లు, నాలుగు మంకీ క్యాప్‌లను గుర్తించారు. వెంటనే ఎనమిది మందిని అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించారు. దీనితో దమ్మపేట సెంటర్‌లోని మహమ్మద్ ఫరా సుల్తానా ఇంటిలో ఉన్న డబ్బులు దొంగతనం చేయటానికి సుల్తానా కోడలు ఇసరత్, సుల్తానా మనుమడుడు ఇసరత్ కొడుకైన అబ్దుల్ వాజిద్‌లు కలిసి సుల్తానా వద్ద నున్న డబ్బులు, నగలు కొట్టేయడానికి కుట్రకు తెరలేపారు. వెంటనే ఇసరత్ తండ్రి మహమ్మద్ ఒస్మాన్ సహాయంతో ముగ్గురు కలిసి పథకం పన్నారు. దీనికి మహమ్మద్ ఒస్మాన్ తనతో పాటుగా బచ్చన్నగూడెం, హైదరాబాద్‌లకు చెందిన ఎనమిది మంది వ్యక్తులను కిరాయికి మాట్లాడుకొన్నారు. దొంగతనం చేసే క్రమంలో ఎవరైనా అడ్డుగా వస్తే వారిపై దాడి చేయటానికి రాడ్‌లు, కత్తి, గుర్తుపట్టడానికి అవకాశం లేకుండా మంకీ క్యాపులను తెచ్చుకొన్నారు. దొంగతనం చేయటానికి ముందుగా రెక్కీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులకు చిక్కటంతో విషయం తెలిసింది. దీనితో ఎస్ఐ. కే సుమన్ మొత్తం 10 మంది పై కేసు నమోదు చేశారు. కాగామహమ్మద్ ఇసరత్ పరారీ కావటంతో తొమ్మిది మందిని రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి ఓ ప్రమాదాన్ని పసిగట్టి నివారించిన ఎస్ఐని, సిబ్బంది హుస్సేన్, అబ్రహంలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో సిఐ సతీష్, అదనపు ఎస్ఐ. కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# విద్యా రంగం పట్ల ప్రభుత్వ వైఖరి నశించాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** విద్యా రంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరి నశించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ తెలిపారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం ఖమ్మం పాత బస్టాండ్ వద్ద రోడ్డు ఊడుస్తూ, భిక్షాటన చేస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ మాట్లాడుతూ విద్యా రంగ సమస్యలను పరిష్కరించడంలో తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో ప్రైవేటు కళాశాలలను బంద్ చేసి నాలుగు రోజులు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుండా కాలయాపన చేస్తుందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా విద్యాశాఖ మంత్రి లేకపోవడం ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి కనపడుతుందన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ. 10వేల కోట్లకు పైగా పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే వాటిని విడుదల చేయాలని లేని పక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు త్రినాథ్, రాజు, ఉపాధ్యక్షులు లోకేష్, భరత్, సింధు, సాత్విక, త్రివేణి, శ్రవ్య, నందిని, సింధూజ, ధరణి, కావ్య తదితరులు పాల్గొన్నారు.

# వెట్ ల్యాండ్ పరిరక్షణతో పర్యావరణానికి మేలు



**-అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వెట్ ల్యాండ్ పరిరక్షణతో పర్యావరణానికి మేలు జరుగుతుందని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం నిర్వహించిన వెట్ ల్యాండ్ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రం సింగ్‌తో కలిసి పాల్గొన్నారు. వెట్ ల్యాండ్ కమిటీ బాధ్యతలు, ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను కమిటీ సభ్యులకు జిల్లా అటవీ శాఖాధికారి వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ చిత్తడి భూములు (వెట్ ల్యాండ్) సంరక్షణ కోసం 2017లో ప్రభుత్వం కొన్ని నిబంధనలు ప్రవేశపెట్టిందన్నారు. వెట్ ల్యాండ్ గుర్తింపు, సంరక్షణ కోసం జిల్లా వెట్ ల్యాండ్ కమిటీని కలెక్టర్ ఛైర్మన్‌గా ఏర్పాటు చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రాథమికంగా నోటిఫై చేసేందుకు రాష్ట్రంలో 11.468 వెట్ ల్యాండ్‌లను గుర్తించడం జరిగిందని ఖమ్మం జిల్లాలో 467 వెట్ ల్యాండులు, 8,911 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్నట్లు తెలిందని తెలిపారు. చెరువులు, రిజర్వాయర్, కాలువల ఫీడర్ ఛానెల్స్, మత్స్యశాఖ పరిధిలో ఉన్న ప్రణాళిక, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పరిధిలో ఉన్న సమాచారం పరిగణలోకి తీసుకుంటూ జిల్లాలో ఉన్న చిత్తడి నేలలను ధృవీకరించాలన్నారు. చిత్తడి నేలలను గుర్తించడం ద్వారా భూమి యాజమాన్యం ఎట్టి పరిస్థితుల్లో మారదని రైతులు, భూ యాజమాన్యాలు అనవసర ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. చెన్నైయ్ మహ నగరంలో ఇటీవల వచ్చిన భారీ వరదలకు చిత్తడి నేలలు సంరక్షించకపోవడం ప్రధాన కారణమని తేలిందన్నారు. క్షేత్రస్థాయిలో చిత్తడి నేలల్లో పర్యటించి స్థానిక పరిస్థితులపై నివేదిక సిద్ధం చేసి జిల్లాలో గుర్తించిన చిత్తడి నేలలను ఆరు నెలలలోపు నోటిఫై చేయాలన్నారు. చింతకాని మండలం పైలెట్ క్రింద ఎంపిక చేసి ముందస్తుగా చిత్తడి నేలలను గుర్తించి అక్కడ పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. నీటి వనరులలో ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్ సమీపంలో తడి భూములను గుర్తించాలన్నారు. వచ్చే మంగళవారం నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు.ఈ సమావేశంలో డిఆర్‌డివో సన్యాసయ్య, జిల్లా వ్యవసాయ శాఖాధికారి పుల్లయ్య, డిపివో ఆశాలత, జిల్లా మత్స్యశాఖాధికారి శివప్రసాద్, జిల్లా ఇరిగేషన్ అధికారి టి. వెంకట్రామ్, డిప్యూటీ సిఈవో కె. నాగపద్మజ, జిల్లా ఉద్యానవన అధికారి ఎంఈ మధుసూదన్, ఇరిగేషన్ ఈఈ అనన్య, మధిర, వైరా మున్సిపల్ కమిషనర్లు సంపత్‌కుమార్, గురులింగం, ఖమ్మం కార్పోరేషన్ హార్టికల్చర్ అధికారిణి రాధిక పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణాదారుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్సై



**ప్రజాపక్షం/వైరా:** మానవ అక్రమ రవాణా గురించి పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని వైరా ఎస్సై రామారావు అన్నారు. స్కోప్ ఆర్డి మై చాయిసెస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కెజి సిరిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు ఏర్పాటు చేసిన సురక్షిత గ్రామ కార్యక్రమంలో రామారావు మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అనేది నానాటికి పెరిగిపోతుందని, నివారించడానికి అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలీస్ వ్యవస్థ అక్రమ రవాణాని అడ్డుకోవడం కోసం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. బాలబాలికలు చదువు మీద దృష్టి పెట్టాలని ఇతర వ్యాపకాలు చెడు అలవాట్లు దూరంగా ఉండాలని సెల్‌ఫోన్‌ని కేవలం మంచి పరిజ్ఞానం తెలుసుకోవడానికి మాత్రమే వినియోగించాలని హితవు పలికారు. అక్రమ రవాణా చేయడానికి అనేక మార్గాల్లో ఆస్కారం ఉందని తెలిపారు. అనుమానం వస్తే వెంటనే డయల్ 100, 18004198588, 1098లకు తెలిపి సహాయం పొందవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కోల్ ఆర్డికోఆర్డినేటర్ కె.సుజాత, శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం పూసలపాడు సొసైటీ పరిధిలోని పిపిసి పూసలపాడు, పిపిసి నారపనేనిపల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా సివిల్‌సప్లై అధికారి కె.చందనకుమార్, ఆర్ఐ కిరణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ తేమశాతం రాగానే మిల్లులకు తరలించే ఏర్పాట్లు చేశామని, మిల్లులు కూడా టాగ్ చేయడం పూర్తయిందని తెలిపారు. అలాగే ధాన్యం తేమశాతంను కొత్తగా ఏఎంసి ద్వారా ఇచ్చిన మీటర్లను పరిశీలించారు. పాత మీటర్లకి కొత్త మీటర్లకి తేమశాతం తేడా అధికంగా ఉండటం గుర్తించారు. వెంటనే జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే జాయింట్ కలెక్టర్ అట్టి మాయిశ్చర్ మీటర్లని ఇచ్చి కొత్తవి తీసుకోమిన తెలియజేశారు. అట్టి మీటర్లపై డిఫెక్ట్ అని వ్రాసి మీటర్లను ఎవరికి ఇవ్వద్దని సంబంధిత అధికారులను ఆదేశించారు. దాచాపురం చెక్‌పోస్ట్‌ని కూడా తనిఖీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ గాలి శ్రీనివాసరావు, సంఘ కార్యదర్శి జి.చిన్నకృష్ణయ్య, సంఘ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ర్యాగింగ్‌కు పాల్పడి భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దు

**-ఖమ్మం నగర ఏసిపి రమణమూర్తి**




**ప్రజాపక్షం/ ఖమ్మం క్రైం :** ర్యాగింగ్‌కు పాల్పడి భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని ఖమ్మం నగర ఏసిపి రమణమూర్తి తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు యాంటీ ర్యాగింగ్ చట్టంపై గురువారం మమత మెడికల్ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏసిపి రమణమూర్తి మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో ర్యాగింగ్‌పై నిషేధం ఉందన్నారు. సీనియర్స్ జూనియర్స్ పట్ల ర్యాగింగ్‌కు పాల్పడటం చట్టాన్ని అతిక్రమించినట్లేనన్నారు. విద్యార్థుల పట్ల ర్యాగింగ్‌కు పాల్పడుతూ వికృత చేష్టలు చేసే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ర్యాగింగ్ వల్ల విద్యార్థుల భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. సీనియర్స్, జూనియర్స్ స్నేహంతో కలిసిమెలిసి ఉండాలన్నారు. విద్యార్థినిలపై ఎటువంటి వేధింపులు, దౌర్జన్యాలు, అసభ్య కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు. ఎవరైనా ర్యాగింగ్‌కు గురైతే తక్షణమే ప్రిన్సిపల్, యాజమాన్యానికి లేదా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ర్యాగింగ్ విద్యార్థుల భవిష్యత్తును మాత్రమే కాకుండా సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. విద్యా సంస్థల యాజమాన్యం, అధ్యాపకులు, పోలీసులు కలిసి పనిచేసినప్పుడే ర్యాగింగ్ సంస్కృతిని నిర్మూలించగలుగుతామన్నారు. చట్టాన్ని తెలుసుకుని భవిష్యత్తుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యను అభ్యసిస్తూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనురాధ, ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# హత్య చేసిన నిందితుల రిమాండ్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఈ నెల 3వ తేదీన ముత్తగూడెంలో రెండు కుటుంబల కలహాల నేపథ్యంలో గునిగంటి నాగమణి అనే మహిళను హతమార్చిన నిందితులను గురువారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన వివరాలను సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ముష్క రాజు పోలీస్ స్టేషన్‌లో వెల్లడించారు. మృతురా లికి కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని నిందితుల కోసం దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో హత్యకు పాల్పడిన మొటపోతుల మనోజ్, ఎల్దీ వెంకన్న, కుట్రకు సహకరించిన మొటపోతుల వెంకటేశ్వర్లు, మొటపోతుల అనిత, అఖిలను ఖమ్మంనగర సమీపంలో పారిపోతుండగా పట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు హరికృష్ణ, రాజారాం, కానిస్టేబుల్‌లు పాల్గొన్నారు.

# సిపిఐ పోరాట ఫలితంగా ప్యాచ్‌రోడ్డు

**అభినందనలు తెలిపిన వాహనదారులు, ప్రజలు**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో గల ఖమ్మంసూర్యాపేట రాష్ట్రీయ రహదారిపై పెద్దగుంత ఏర్పడింది. దీంతో వాహనాలు అందులో పడి గుల్లవుతుండటంతో పాటు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజాపక్షం దినపత్రికలో సెప్టెంబర్ 29న ప్రధాన రహదారిపై గుంత అనే శీర్షికన కథనం ప్రచురించింది. స్పందించిన ఆర్అండ్‌బి అధికారులు తూతూ మంత్రంగా కంకరపోసి గుంతను పూడ్చారు. తాజాగా సంభవించిన మొంథా తుఫాన్‌తో కురిసిన వర్షాలకు గుంత నిండి, ప్రమాదకరంగా మారింది. ఈ నేపథ్యంలో అక్కడి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, జిల్లా సమితి సభ్యుడు వెంపటి సురేందర్, ఎలక్ట్రికల్‌షాప్ యజమాని బబు తరాం ఆ గుంతలో డ్రమ్మును ఏర్పాటు చేసి ఎర్రజెండాను ప్రమాదసూచికగా పెట్టారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 30న పత్రికలలో కథనాలు రావడంతో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయినప్పటికీ ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంతో సిపిఐ నేత దండి రంగారావు యువజన సంఘం సభ్యులతో కలిసి అక్టోబర్ 30వ తేదీన కాంక్రీట్ ద్వారా గుంతను స్వయంగా పూడ్చారు. ఈ తరుణంలో ఎట్టకేలకు ఆర్అండ్‌బి అధికారులు ప్యాచ్‌రోడ్డు వేసి గుంతలను పూడ్చారు. ఈ సందర్భంగా సిపిఐ, ప్రజాపక్షం దినపత్రిక ఫలితంతో ప్యాచ్‌రోడ్డు ఏర్పాటు కావడంపై వాహనదారులు, ప్రజలు అభినందనలు తెలిపారు.

# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** వరి రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రైవేట్ వ్యాపారుల వద్ద వరి ధాన్యాన్ని విక్రయించి ఇబ్బందులు పడవద్దని ప్రభుత్వం నిర్ణయించిన కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వరి ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించుకుని రైతులు లబ్ధిపొందాలని బిఆరోలు సొసైటీ ఛైర్మన్ రామసహాయం నరేష్‌రెడ్డి అన్నారు. గురువారం బీరోలు సొసైటీ పరిధిలో సుబ్లేడు, కాకరవాయి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల రైతులు ప్రభుత్వం రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఎంతో కృషి చేస్తుందని, వారి పండించిన పంటను దళారులకు విక్రయించి మోసపోకుండా సొసైటీ కేంద్రాల ద్వారా వరి ధాన్యాన్ని సన్నరకానికి రూ.2,389 ధరతో పాటు బోనస్ రూ.500 ఇస్తుందని, దొడ్డు రకం బియ్యంకు మద్దత ధర రూ.20 తక్కువ వస్తుందని ఆయన తెలిపారు. ప్రైవేట్ వ్యాపారుల వద్ద వరి ధాన్యాన్ని విక్రయిస్తే కాటాలు తేడా ఉంటాయని, నగదు రైతుకు చెల్లించే క్రమంలో మోసాలు జరుగుతాయని, అలాంటివి కొనుగోలు కేంద్రాల్లో ఉండవని ఆయన తెలిపారు. నేరుగా రైతు ఖాతాలో నగదు జమవుతుందని వివరించారు. యాసంగి వరి ధాన్యం విక్రయించిన రైతులకు బోనస్ డబ్బులు పడాల్సి ఉందని, అతి త్వరలో ప్రభుత్వం రైతు ఖాతాలో జమ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లూథర్‌విల్సన్, ఎవో నారెడ్డి సీతారామిరెడ్డి, ఎఇఓ బాలకృష్ణ, సాధన, సొసైటీ డైరెక్టర్లు గుండాల లింగయ్య, అన్నం వెంకటరెడ్డి, మండల యువజన కాంగ్రెస్ నాయకులు సంఘబత్తుల సుమన్‌రెడ్డి, బత్తుల వెంకటనారాయణ, సర్వేర్ అప్పారావు, ఆర్ఐ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రఘునాథపాలెం సిఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు గురువారం రఘునాథపాలెం గ్రామంలో మల్టీలెవల్ మార్కెటింగ్, ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్, ఇతర సైబర్ నేరాలపై స్థానిక ప్రజలకు, యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ ఉస్మాన్ షరీఫ్ మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉచితం, ఉత్తమ ఆఫర్ల వెంట దాగి ఉన్న మోసాన్ని గుర్తించాలన్నారు. సైబర్ నేరగాళ్లు ప్రతి రోజు కొత్త మార్గాలలో మోసాలకు పాల్పడుతున్నారని పోలీసులు ప్రజల భద్రతకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ వ్యక్తిగత అప్రమత్తత కూడా చాలా అవసరం అన్నారు. లాటరీ, పెద్ద మొత్తంలో డబ్బులు గెలుచుకున్నారని చెప్పే నకిలీ ఆఫర్లను నమ్మవద్దన్నారు. వాటి వెనక వ్యక్తిగత సమాచారం లేక నగదు కాజేసే ఉద్దేశం ఉంటుందన్నారు. వాట్సాప్‌లో వచ్చే అనవసర లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. ఓటిపిలను, ఏటిఎం కార్డు పిన్‌లను ఇతరత్రా సమాచారాన్ని ఇతర వ్యక్తులకు షేర్ చేయవద్దని సూచించారు. పోలీస్, సిబిఐ నుంచి మాట్లాడుతున్నామంటూ చెప్పే కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను చేరుకోవాలి




**-అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కలెక్టర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను చేరుకోవాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా ఉద్యానవన, సహకార శాఖ, తెలంగాణ ఆయిల్ ఫెడ్, గోద్రెజ్ ఆగ్రోవెట్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన అధికారుల శిక్షణ, అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణ లక్ష్యాలను చేరుకోవడంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. నష్టం ఎట్టి పరిస్థితుల్లో సంభవించడానికి ఆస్కారం లేని పంట ఆయిల్ పామ్ అన్నారు. రైతులకు ఆయిల్ పామ్ పంట సాగు అధిక లాభాలు కలిగిస్తుందన్నారు. 76 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, దీని కోసం నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలన్నారు. జిల్లా ఉన్నతాధికారులు వివిధ చోట్ల పాల్గొంటారని ఆయన తెలిపారు. రైతులకు మొదటి మూడేళ్ల పాటు అంతర్ పంటల ద్వారా ఆదాయం లభిస్తుందన్నారు. అంతర్ పంటల సాగుపై రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందించాలన్నారు. ఆయిల్ పామ్‌పై పిఏసిఎస్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించాలన్నారు. పంట కోతలు ముగిసిన తర్వాత మరోసారి వరి, ఇతర పంటలు సాగు చేయకుండా ఆయిల్ పామ్ సాగు వైపు రైతులు ముందుకు వచ్చేలా చూడాలన్నారు. పిఏసిఎస్ ద్వారా కనీసం వేయి మంది రైతులు నూతనంగా ఆయిల్ పామ్ సాగు చేయాలన్నారు. సోమవారం పిఏసిఎస్ ఛైర్మన్‌లతో మరో మారు సమావేశం నిర్వహించాలన్నారు. రాబోయే గురువారం నుంచి ఫీల్డ్‌లెవల్‌లో పనిచేయాలన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో గన్ని సంచులు ఇంటికి ఇవ్వడానికి వీలు లేదని ఆయన స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలలో గన్ని సంచుల స్టాక్ ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. 48 గంటల ముందు సమాచారం అందిస్తేనే గన్ని సంచులు కొనుగోలు కేంద్రాలకు అందించేందుకు వీలుంటుందన్నారు. తేమ యంత్రాలు పని చేయని పక్షంలో వాపస్ చేయాలన్నారు. టార్పాలిన్ కవర్‌లు పూర్తి స్థాయిలో అందుబాటులో పెట్టుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, డిసివో గంగాధర్, సెరీ కల్చర్ డిడి ముత్యాలు, ప్యాక్ కార్యదర్శులు, హార్టికల్చర్ అధికారులు, ఫీల్డ్ కన్సల్టెంట్ ఆఫీసర్స్, తెలంగాణ ఆయిల్ ఫెడ్, గోద్రెజ్ ఆగ్రోవెట్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై విస్తృత అవగాహన






**ప్రజాపక్షం/ ఖమ్మం క్రైం :** సైబర్ నేరాల పట్ల ఖమ్మం నగరంలో విస్తృతంగా అవగాహన చేపట్టారు. సైబర్ జాగృక్త దివస్‌లో భాగంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు గురువారం సైబర్ క్రైం డిఎస్‌పి సిహెచ్ఆర్‌వి ఫణీందర్ ఆధ్వర్యంలో ఖమ్మం లకారం ట్యాంక్ బండ్ వద్ద వాకర్స్‌కు అవగాహన కల్పించారు. ఖమ్మం వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ ఆధ్వర్యంలో బస్టాండ్‌లో ప్రయాణికులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఖమ్మం టూటౌన్ ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో సర్దార్ పటేల్ మైదానంలో క్రీడాకారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఖానాపురం హవేలీ సిఐ భానుప్రకాష్ ఆధ్వర్యంలో డైట్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మల్టీలెవల్ మార్కెటింగ్, ఇన్వెస్టిమెంట్ ఫ్రాడ్, ఇతర సైబర్ నేరాలపై స్థానిక ప్రజలకు, యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉచితం, ఉత్తమ ఆఫర్ల వెంట దాగి ఉన్న మోసాన్ని గుర్తించాలన్నారు. సైబర్ నేరగాళ్లు ప్రతి రోజు కొత్త మార్గాలలో మోసాలకు పాల్పడుతున్నారని పోలీసులు ప్రజల భద్రతకు ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ వ్యక్తిగత అప్రమత్తత కూడా చాలా అవసరం అన్నారు. లాటరీ, పెద్ద మొత్తంలో డబ్బులు గెలుచుకున్నారని చెప్పే నకిలీ ఆఫర్లను నమ్మవద్దన్నారు. వాటి వెనక వ్యక్తిగత సమాచారం లేక నగదు కాజేసే ఉద్దేశం ఉంటుందన్నారు. వాట్సాప్‌లో వచ్చే అనవసర లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. ఓటిపిలను, ఏటిఎం కార్డు పిన్‌లను ఇతరత్రా సమాచారాన్ని ఇతర వ్యక్తులకు షేర్ చేయవద్దని సూచించారు. పోలీస్, సిబిఐ నుంచి మాట్లాడుతున్నామంటూ చెప్పే కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన వర్కర్లకు వైద్య శిబిరం



**ప్రజాపక్షం/ మధిర :** మండల పరిధిలోని దెందుకూరు, మాటూరుపేట పిహెచ్‌సిల నందు గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్యాధికారుల సూచనల మేరకు వైద్యాధికారి డాక్టర్ పృథ్వీరాజ్, పిపి యూనిట్ వైద్యులు డాక్టర్ రాంమోహన్ నాయక్, డాక్టర్ వీరబాబు ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో పిహెచ్‌సిల పరిధిలోని మధ్యాహ్న భోజన వర్కర్లకు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భోజన వర్కర్లకు రక్త పరీక్షలు, కిడ్ని పనితీరు టెస్టు, లివర్ ఫంక్షన్ టెస్టు, టైఫాయిడ్ టెస్టు, సిబిపి టెస్టులు నిర్వహించి టిహబ్‌కు పంపించారు. అదేవిధంగా ఈ రోజు కూడా దెందుకూరు, మాటూరుపేట పిహెచ్‌సి పరిధిలోని స్కూల్స్‌లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన వర్కర్లకు టెస్టులు చేయటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ వై.ప్రభాకర్, ఆయా పాఠశాలల హెచ్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వి.వెంకటేశ్వర్లు, హెచ్ఎస్ లంకా కొండయ్య, హెచ్‌విబి సరోజినిదేవి, ల్యాబ్ టెక్నిషియన్ శ్రీనివాస్, ఎంఎల్ హెచ్‌పిలు ఐశ్వర్య, వెంకటలక్ష్మి, నర్సింగ్ ఆఫీసర్ సృజన, ఫార్మాసిస్టు పద్మజ, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

# మెకానిక్‌కు ఆర్థికసాయం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పొరేషన్ టూ వీలర్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో టూ వీలర్ మెకానిక్‌కు ఆర్థిక సాయం అందజేశారు. ఖమ్మంలో టూ వీలర్ మెకానిక్‌గా 30 ఏళ్లుగా పని చేస్తున్న దేగల ఉపేందర్ రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తలకు బలమైన గాయాలయ్యాయి. ఖమ్మం, హైదరాబాద్ ఆసుపత్రులలో వైద్య చికిత్స పొందారు. సుమారు రూ. 10లక్షలకు పైగా వైద్యం కోసం ఖర్చు కాగా విషయం తెలుసుకున్న ఖమ్మం జిల్లా, రాష్ట్రంలోని మెకానిక్ సోదరులంతా తమ వంతుగా సహాయ సహకరాలను అందించారు. ఖమ్మం కార్పోరేషన్ టూ వీలర్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం రూ. 75వేల ఆర్థిక సహాయాన్ని యూనియన్ అధ్యక్షులు వంగాల కొండలరావు, ప్రధాన కార్యదర్శి లింగనబోయిన మురళి, వర్కింగ్ ప్రెసిడెంట్ బుల్లెట్ అన్వర్ చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ యూనియన్‌లో సభ్యత్వం కలిగిన ప్రతి ఒక్క మెకానిక్‌కు యూనియన్ తరుపున అండగా ఉంటున్నామన్నారు. మెకానిక్‌లకు ఎటువంటి ఆపద వచ్చిన యూనియన్ ఎల్లవేళల అందుబాటులో ఉంటూ వాటిని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సహాయ కార్యదర్శి గడ్డం లాలయ్య, ప్రచార కార్యదర్శి తమ్మిశెట్టి వెంకటేశ్వరరావు, అబ్బాస్, చందు తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి



**ప్రజాపక్షం/ మధిర :** ప్రతి పశువుకి వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయాలని పశుసంవర్ధకశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బోడేపూడి శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని జాలిముడి, ఇల్లెందులపాడు గ్రామాల్లో జరుగుతున్న ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ వైద్య శిబిరాలను మండల పశువైద్యాధికారి డాక్టర్ ఉమాకుమారి ఆధ్వర్యంలో సందర్శించారు. పశువులకు అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 90శాతం గ్రామాల్లో టీకాలు పూర్తి చేసినట్లు, మిగితా గ్రామాల్లో కూడా షెడ్యూల్ ప్రకారం శిబిరాలను నిర్వహించాలని తెలిపారు. ఈ శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని, తప్పనిసరిగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇతర పశు వైద్య సిబ్బంది, గోపాల మిత్రలు, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలో చిన్నారులకు అన్నప్రాసన



**ప్రజాపక్షం/ఎర్రుపాలెం :** మధిర ఐసిడిఎస్ సెక్టార్ పరిధిలోని ఎర్రుపాలెం మండలం గుంటుపల్లిగోపవరం గ్రామ అంగన్వాడీ కేంద్రంలో సూర్వైజర్ సరిత ఆధ్వర్యంలో గురువారం చిన్నారులకు అన్నప్రసన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సరిత మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు చిన్నారులకు ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. గర్భిణీ మహిళలు డెలవరీ వరకు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. చిన్నారులకు శుభ్రత, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ మందడపు రాజేశ్వరి, వెంకమ్మ, వెంకటనర్సమ్మ, గర్భిణీలు బాలింతలు, చిన్నారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీవారి హుండీ ఆదాయం రూ.38.45లక్షలు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ లెక్కింపును గురువారం నిర్వహించారు. హుండీ లెక్కింపు ద్వారా స్వామి వారికి రూ.38.45 లక్షలు వచ్చినట్లు ఆయల నిర్వాహణాధికారి కొత్తూరు జగన్మోహన్‌రావు తెలిపారు. 133రోజులకు గాను కానుకుల ద్వారా ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఖమ్మం జిల్లా దేవాదాయ పరిశీలకులు వెంకటేశ్వర్లు హుండీల లెక్కింపును పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానఅర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సీనియర్ అసిస్టెంట్ సోమయ్య, జూనియర్ అసిస్టెంట్ కృష్ణ ప్రసాద్, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు, మధిర శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా వైద్యులు సురేందర్ జన్మదిన వేడుకలు





**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** ఖమ్మం నగరంలోని ప్రముఖ చెస్ట్ వైద్యనిపుణులు, బ్రీత్ చెస్ట్ అండ్ జనరల్ హాస్పటల్ అధినేత గోపగాని సురేందర్ జన్మదిన వేడుకలను ఆయన స్నేహితులు ఘనంగా గురువారం నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్ ప్రాంగణ సమీపంలో వైద్యులు సురేందర్ స్నేహితులు అన్న క్యాంటీన్ చే 100 మందికి అన్నప్రాసద వితరణ నిర్వహించారు. స్నేహితుని జన్మదిన వేడుకకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. ఖమ్మం నగర వైద్యులు, హాస్పటల్ యాజమాన్యాలు, పలువురు ప్రముఖులు వైద్యులు సురేందర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# పశువులకు గాలికంటు టీకాలు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని ఏదులాపురం, కైకొండాయిగూడెంకు చెందిన 93పశువులకు పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో వైద్యులు అనంతుల హరీష్ గాలికుంట టీకలను వేశారు. అలాగే కామంచికల్‌లోని సీమపందుల ఫాంను సందర్శించారు. వ్యాధులు రాకుండా చేపట్టాల్సిన పలు సూచనలను నిర్వాహకులకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువ్యాధి నిర్ధారణకేంద్రం సహాయ సంచాలకురాలు డాక్టర్ వి. అరుణ, జిల్లా పశుసంవర్ధకశాఖ ఆఫీస్ సహాయ సంచాలకురాలు డాక్టర్ రమణి, పశువైద్య సిబ్బంది పాషా, రవి, రామారావు, వినయ్, శ్రీను, సందీప్, రైతులు నాగేశ్వరారవు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# బూడిద తోలకాలు స్థానికులకే అవకాశం కల్పించాలి : ఎఐటియుసి



ప్రజాపక్షం/పాల్వంచ : కేటిపిఎస్ యాష్‌పాండ్ బూడిద తరలింపు కోసం స్థానిక లారీ యాజమానులకే అవకాశం కల్పించాలని ఏఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. కేటిపిఎస్ అల్లూరి సెంటర్‌లో ఏఐటియుసి అనుబంధ లారీ ఒనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఏఐటియుసి జిల్లా నాయకులు ఇట్టి వెంకటరావు, అన్నారపు వెంకటేశ్వర్లు, నిమ్మల రాంబాబులు మాట్లాడుతూ మొదటి నుండి కేటిపిఎస్ కర్మాగారానికి చెందిన యాష్‌పాండ్‌ను నమ్ముకొని పాల్వంచకు చెందిన 129 మంది అప్పులు తెచ్చుకొని టిప్పర్, లారీలను కొనుగోలు చేసుకొని దశాబ్దాల తరబడి నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవేకు బూడిదను తరలిస్తూ జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. స్థానికులను కాదని గత నాలుగు నెలల క్రితం స్థానికేతరుడైన పుచ్చకాయల వీరభద్రం అను వ్యక్తి తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే వారితో కుమ్మక్కై, కొందరు ప్రజాప్రతినిధులకు తప్పుడు సమాచారం ఇచ్చి వారిని సైతం తప్పుదోవ పట్టించి స్థానిక లారీలను నిలిపివేయించాడు. ఖమ్మం, వైరా ప్రాంతాలకు చెందిన తనవారి లారీలతో యాష్‌ను తరలిస్తూ స్థానికుల నోట్లో మట్టి కొడుతున్నాడని విమర్శించారు. దశాబ్దాల నుండి కేటిపిఎస్ నుండి వచ్చే కాలుష్య ప్రభావంతో వేలాది మంది అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వందల ఎకరాల పంట భూములు బీళ్ళుగా మారిపోయినా స్థానికులు భరిస్తున్నారని అన్నారు. స్థానికులైన గిరిజన, గిరిజనేతరులకు బూడిద తరలింపులో రావటం అరకొరగానే ఉంటుందన్నారు. స్థానిక లారీ ఓనర్లు శ్రీలత కన్స్ట్రక్షన్స్ పేరుతో అనుమతులు తీసుకొని రోజుకు వందల లారీల బూడిదను తరలిస్తూ జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. దీనిని చూసి ఓర్వలేని, జీర్ణించుకోలేని పుచ్చకాయల వీరభద్రం అనే ధనస్వామి స్థానిక పాల్వంచ లారీ ఓనర్ల పొట్టగొట్టి అప్పుల పాలుజేసి బజారున పడేయాలనే దుర్బుద్ధితో, దురుద్దేశంతో కుట్రలు చేసి స్థానికులను యాష్ తరలించకుండా, ఒక వేళ తరలించినా దిగుమతి చేసుకోకుండా నిలిపివేయటం చేస్తున్నాడని మండిపడ్డారు. దీనికి కొందరు రాష్ట్రస్థాయి ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవటం దుర్మార్గమన్నారు. ఈ విషయంపై సంభందిత అధికారులకు, పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పంధించి పాత రన్నింగ్ టెండర్లను కొనసాగిస్తూ స్థానిక లారీ ఓనర్లకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఏఐటియుసి అనుబంద లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు వీసంశెట్టి పద్మజ, ఏఐటియుసి నాయకులు శనిగారపు శ్రీనివాసరావు, లాల్‌పాషా, రామాచారి, అల్లి వెంకటేశ్వర్లు, ఈ. రామారావు, చెన్నయ్య, వాంకుడోత్ రవి, కరీమ్‌పాషా, సత్యనారాయణ, లారీ యాజమానులు కసిరెడ్డి మధుకర్ రెడ్డి, సీతారాములు, రాంబాబు, శ్రీనివాసరెడ్డి, బాదుల్లాహ్, వేణు, దుర్గాప్రసాద్, వెంకట్, డి. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఏఐఎస్ఎఫ్ మండల మహాసభ




ప్రజాపక్షం/అశ్వాపురం: స్థానిక అశ్వాపురం మండలం నందు ఏఐఎస్ఎఫ్ మండల మహాసభ ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఈనపల్లి పవన్ సాయి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ పాల్గొని మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం రవి అస్తమించిన బ్రిటిష్ సామ్రాజ్యంపై విద్యార్థుల్ని యువకుల్ని ఐక్యం చేస్తూ 1936 ఆగస్టు 12 ఉత్తరప్రదేశ్‌లోని లక్నో మహానగరం లోనీ బెనారస్ విశ్వవిద్యాలయంలో పొత్తిల్లాలో పిడికిలి బిగించి దేశ స్వతంత్రం కోసం పోరాడాలని సంఘం అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ అని, నేటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలు మీద విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుందన్నారు. అదే విధంగా ఏఐఎస్ఎఫ్ విద్యార్థి ఉద్యమనికి ఒక చరిత్ర ఉందని చదువుతూ పోరాడు చదువుకై పోరాడు నినాదంతతో విద్యార్థులను చైతన్యవంతు చేస్తూ శాస్త్రీయ విద్య విధానం కోసం మొట్టమొదటిగా ఈ దేశంలో కొట్లాడిందని, ఏఐఎస్ఎఫ్ అని విద్యా వ్యాపారీకరణకు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విద్యార్థులు ఐక్యం కావాలని అందుకోసం ఈ యొక్క ఏఐఎస్ఎఫ్ మండల మహాసభల దోహదపడాలని విద్యారంగ సమస్యల మీద కళాశాలల సమస్యలు మీద విద్యార్థులు చైతన్యవంతంగా సమస్యల పరిష్కారం పట్ల ముందుండి పోరాడాలని ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘంలో పని చేయడం మంచి నైతిక విలువలు కలిగిన నాయకులుగా తయారవ్వడమేనని అన్నారు. ఈ మహాసభ ద్వారా ఎన్నికైన నూతన అశ్వాపురం మండల సమితి మండలంలో ఉన్నటువంటి ప్రభుత్వ విద్యారంగ సమస్యల పట్ల ఉద్యమాలకు సిద్ధం కావాలని రాష్ట్రంలో దేశంలో జరుగుతున్నటువంటి విద్యా వ్యతిరేక విధానాల మీద ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధి ఏఐఎస్ఎఫ్ విద్యార్థి ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఈనపల్లి పవన్ సాయి, జిల్లా ఉపాధ్యక్షులు అక్కినపల్లి, నాగేంద్ర బాబు, ఈనపల్లి సిద్ధార్థ, పడిదల నిఖిల్, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం..!

**-ఆత్మహత్యకు యత్నించిన బాధితులు**



ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం మండలంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నయా మోసానికి తెరలేపారు కొంత మంది వ్యక్తులు. వారి నుండి మోసపోయిన బాధితులైన భద్రాద్రి జిల్లా ఇల్లందు మండలం తిలక్ నగర్ చెందిన మల్లేశం తన కుమారుడు ప్రశాంత్ ఇచ్చిన వివరాల మేరకు మణుగూరు భారజల కర్మాగారం ప్లాంట్‌లో అకౌంటెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని, అశ్వాపురం మండలానికి చెందిన వ్యక్తులు భరత్ కుమార్‌రెడ్డి, గద్దల నాగేశ్వరరావు డబ్బులు తీసుకుని సంవత్సరం గడుస్తున్న ఉద్యోగం ఇప్పించడం లేదు, డబ్బులు ఇవ్వడం లేదు అని మనస్పర్ధంతో ఆత్మహత్యాయత్నానికి సిద్ధమైనామని బాధితులు వారి గోడు వెళ్ళబోసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగం అంటే ఆశపడ్డామని ముందుగా ఉద్యోగం కచ్చితంగా వస్తుందని మమ్మల్ని అశ్వాపురం తీసుకువచ్చి అశ్వాపురంలోని భారజల కర్మాగారం ప్లాంట్‌లో అకౌంటెంట్ పోస్ట్ ఇప్పిస్తామని అనంతరం భారజల కర్మాగారం గౌతమినగర్‌లో ఒక వ్యక్తితో ఇంటర్వ్యూ చేయించి అనంతరం గౌతమినగర్ కాలనీ నివాసం చూపించి ఇది మీకు మంజూరు అయినదని ఒక నెలలో ఉద్యోగం వస్తుందని ఆశ చూపారని అనంతరం వారి ఆశకు లోబడి కొంత డబ్బును వారి చేతికి ఇచ్చామని అనంతరం మెడలో ఉన్న బంగారం కూడా చేతికి ఇచ్చిన వారు ఇంకా మా వద్ద నుండి డబ్బులు లాగాలని చూశారని, ఇంతలో వీర సమాచారం తెలుసుకుని వారిని అడగగా ముఖం చాటేస్తున్నారని, ఉద్యోగం వస్తుందని ఆశతో ప్రశాంత్ భార్య వారి కుటుంబం వైపు ఉన్న వారు వివాహం చేశారని, ఇప్పుడు ఉద్యోగం లేదని తెలిసిన అనంతరం భార్య పుట్టింటికి వెళ్లిందని ఉద్యోగం రాక పోయి, డబ్బులు పోయి, భార్య పోయి అన్ని కూడా తలుచుకొని మన స్థాపన చెందామని మాకు కచ్చితంగా న్యాయం చేయాలని లేనియెడల మేము మోసగించిన వ్యక్తుల నివాసాల ముందే పెట్రోల్ పోసుకొని చనిపోతామని ఆత్మహత్యం ఆత్మహత్యాయత్నం చేసుకోవడానికి ప్రయత్నించగా చుట్టు పక్కల వారు అశ్వాపురం పోలీస్ వారికి సమాచారం ఇవ్వగా వారి యొక్క సిబ్బందితో బాధితులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**సిఐ వివరణ....**

జరిగిన సంఘటనలపై సిఐ అశోక్‌రెడ్డిని ప్రజాపక్షం విలేఖరి వివరణ అడుగగా సీఐ మాట్లాడుతూ బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మోసగించిన వ్యక్తులైన భరత్ కుమార్‌రెడ్డి, గద్దల నాగేశ్వరరావుపై కేసు నమోదు చేశామని అన్నారు.

# లతీఫ్ సేవలు అభినందనీయం : ఎస్సై



ప్రజాపక్షం/వైరా: వైరా మండలం సిరిపురంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 20 మంది విద్యార్థులకు సోషల్ వర్కర్, లతీఫ్ 2500 వైరా సబ్ ఇన్స్‌పెక్టర్ పుప్పాల రామారావు చేతుల మీదుగా పరీక్ష ఫీజు కోసం విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, సోషల్ వర్కర్ లతీఫ్ ఎస్సై రామారావుని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, అంగన్‌వాడీ టీచర్లు, గుంటుపల్లి రాజేశ్వరి, కొత్తపల్లి ప్రమీ2ల, ఆర్‌టిసి కండక్టర్ షేక్ సైదా, షేక్ నూర్జహా, షేక్ కతిజాబి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మోడల్ అంగన్వాడీ రూపకల్పనలో భాగస్వాములుకండి : కలెక్టర్

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : మోడల్ అంగన్వాడీల రూపకల్పనలో అంతా భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. అంగన్వాడీ కేంద్రాలను ఆధునీకరంగా, సుందరీకరంగా తీర్చిదిద్దేందుకు డిజైన్ ఛాలెంజ్ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. అంగన్వాడీలను ఆదర్శంగా తయారు చేయడమే ఈ డిజైన్ ఛాలెంజ్ ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. డిజైన్ సమర్పించే ఆర్కిటెక్ట్, కన్సల్టెంట్లు ప్రాజెక్టు రూపకల్పనతో పాటు అమలు దశలో సాంకేతిక సహకారం అందించగల సామర్థ్యం కలిగి ఉండాలన్నారు. డిజైన్ ప్రతిపాదనలు నవంబర్ 12 తేది సాయంత్రం 5 గం.లగో సమర్పించాలని, ఆసక్తి గల వారు మెయిల్ ద్వారా పంపవచ్చన్నారు. మెయిల్ కలెక్టర్‌బిడిడి@తెలంగాణ.గవ్.ఇన్ మెయిల్ కు పంపాలని సూచించారు.

# క్రీడలతో క్రమశిక్షణ అలవడుతోంది



ప్రజాపక్షం/నేలకొండపల్లి : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలి అని. క్రీడలతో శారీరక ధారుడ్యంతో పాటుగా క్రమశిక్షణ అలవడుతుంది అని మండలంలోని రాయగూడెం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు అన్నారు. గత రెండు రోజుల క్రితం నేలకొండపల్లి కొత్త కొత్తూరులోని సెయింట్ ఫ్రాన్సిస్ హై స్కూల్ లో జరిగిన మండల స్థాయి పాఠశాల కబడ్డీ పోటీలలో రాయగూడెం పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. ఈ సందర్భంగా గురువారం కబడ్డీలో ప్రథమ బహుమతిని గెలుచుకున్న విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు మెడల్స్ తో పాటు ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా వారిలో మానసిక ఉల్లాసం, వికాసంతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. తద్వారా విద్యార్థులు ఎంచుకున్న రంగాలలో రాణించేందుకు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. సామాజిక కార్యక్రమాలలో కూడా విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సుంతరమోని నాగార్జున, సత్యనారాయణ, రాజు, నాగేశ్వరరావు, మాధవి లత, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డుదారులకు ఇందిరమ్మ చేతి సంచులు పంపిణీ



ప్రజాపక్షం/నేలకొండపల్లి : ప్లాస్టిక్ రహిత సమాజంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డు దారులకు ఇందిరమ్మ చేతి సంచులను పంపిణీ చేశారు. మండలంలోని కోనాయిగూడెంలో ప్రభుత్వ చౌకదుకాణం డీలర్ వడ్డె సుబ్బారావు చేతుల మీదుగా గురువారం కార్డుదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యావరణం పరిరక్షణ లో భాగంగా ప్రభుత్వం ప్లాస్టిక్ రహిత సంచులను అందిస్తున్నట్లు తెలిపారు. చేతి సంచులను కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం ను పూర్తిగా తగ్గించుకోవాలని సూచించారు. ప్రజలను చైతన్యం చేసేందుకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బైరం దినేష్కుమార్, ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు తిగుళ్ల భాస్కర్, గ్రామ దీపిక కొమ్మినేని పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప భక్తులకు నిత్య అన్నదానం



ప్రజాపక్షం/నేలకొండపల్లి : అయ్యప్ప స్వామి భక్తుడు మాలధారణ స్వీకరించిన భక్తులకు నిత్య అన్నదానం చేపట్టారు. నేలకొండపల్లి కి చెందిన చికెన్ సెంటర్ వ్యాపారి భూక్యా ఉపేందర్ నాయక్ అనే య్యప్ప భక్తుడు అయ్యప్ప స్వామి పై ఉన్న భక్తి భావం తో మాల వేసుకున్న భక్తులకు 41 రోజుల పాటు నిత్య అన్నదానం చేపట్టారు. ప్రతీ రోజు దాదాపు 300 మంది భక్తులకు నిత్య అన్నదానం చేస్తున్నారు. ఈ సందర్భంగా అన్నదాత భూక్యా ఉపేందర్ మాట్లాడారు. య్యప్ప స్వామి వలన తనకు మంచి జరుగుతుందని పేర్కొన్నారు. అందుకే ఉడతా భక్తి సహాయంగా తాను అన్నదాన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. తనకు అన్నదానం చేసేందుకు స్థలం షెల్టర్ ఇచ్చిన మాజీ సర్పంచ్ రాయపూడి నవీన్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# కొమ్మినేపల్లి జిపి ఆకస్మికంగా తనిఖీ



ప్రజాపక్షం/కామేపల్లి: కొమ్మినేపల్లి గ్రామ పంచాయితీలో రికార్డులు తనిఖీ చేసి రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని సెక్రటరీలు ప్రజలకు జవాబు దారితనంగా రికార్డుల నిర్వహణ చేపట్టాలని డిఎల్‌పిఓ రాంబాబు అన్నారు. కొమ్మినేపల్లి గ్రామ పంచాయితీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డుల నిర్వహణపై తగు సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం కొమ్మినేపల్లి జెడ్‌పిహెచ్ఎస్ నందు పారిశుద్ధ్యం మౌలిక సదుపాయాల గుర్చి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్యం జరుగుతున్న తీరును పరిశీలించారు. నాటిన ప్రతి మొక్కను బతికించాలని, ప్రతి రోజు చెత్త సేకరణ జరగాలన్నారు. ఈకార్యక్రమంలో కామేపల్లి మండల ఎంపీడీవో జి రవీందర్, పంచాయితీ కార్యదర్శి జి శంకర్, పంచాయితీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పిఎంశ్రీ నిధులు సమర్ధవంతంగా వినియోగించాలి

**-ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ శ్రీజ**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పిఎంశ్రీ నిధులు సమర్ధవంతంగా వినియోగించాలని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ డా॥ పి.శ్రీజ తెలిపారు. ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో పిఎంశ్రీ నిధుల వినియోగంపై సంబంధిత అధికారులతో ఇంచార్జ్ కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎంపికైన 28 పిఎంశ్రీ పాఠశాలలకు నిధులు మంజూరయ్యాయని వీటిని సమర్ధవంతంగా వినియోగించుకుంటూ పిల్లలకు మెరుగైన విద్యాబోధన అందేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. పిఎంశ్రీ పాఠశాలలో క్రీడల అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. యూత్ ఏకో క్లబ్ ఏర్పాటు చేయాలన్నారు. పిఎంశ్రీ పాఠశాలలో చదివే పిల్లలను పరిశ్రమ విజిట్‌కు తీసుకు వెళ్లాలని దీనికి సంబంధించిన కార్యాచరణ సిద్దం చేయాలన్నారు. ఏక్ భారత్ శ్రేష్ట భారత్ కార్యక్రమం క్రింద పాఠశాలల్లో వినూత్న కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్దం చేయాలన్నారు. ఈ సమావేశంలో విద్యాశాఖ ప్లానింగ్ కో ఆర్డనేటర్ సిహెచ్ రామకృష్ణ, మండల విద్యాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

**కార్పోరేషన్ అధికారులతో సమీక్ష...**

ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో కార్పోరేషన్ అధికారులతో అదనపు కలెక్టర్, ఇంచార్జ్ మున్సిపల్ కమిషనర్ డా॥పి.శ్రీజ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పలు అంశాలపై చర్చించి సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలోని అన్ని షాపులను తనిఖీ చేసి ట్రేడ్ లైసెన్స్‌లతో అనుసంధానం చేయాలని ఆదేశించారు. లైసెన్స్‌లు లేని షాపులకు నోటీసులు జారీ చేయాలన్నారు. డివిజన్లలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో శానిటేషన్ పనులు చేపట్టి రిపోర్టు సమర్పించాలన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుధ్య పనులు చేపట్టి చెత్తను తొలగించాలన్నారు. రహదారి విస్తరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. గృహలక్ష్మి యోజనకు సంబంధించిన జియో ట్యాగింగ్ పనులు పూర్తి చేసి పన్ను వసూళ్లపై దృష్టిసారించాలన్నారు.

# రఘునాథపాలెం స్టేషన్‌ను సందర్శించిన ఏసిపి

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌ను ఖమ్మం నగర ఏసిపి రమణమూర్తి సందర్శించారు. గురువారం రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌ను ఏసిపి రమణ మూర్తి సందర్శించి స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరు, సెక్టార్ అధికారుల విచారణ నివేదికలు, సిసిటిఎన్ఎస్ అప్‌లోడ్, జనరల్ డైరీ రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. పిటిషన్ విచారణకు సంబంధించి సిబ్బందితో మాట్లాడారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, డయల్ 100 కాల్స్ ప్రతిస్పందన సమయం, సస్పెక్ట్ షిట్లు, పెండింగ్ కేసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తూ వాహన తనిఖీలను ముమ్మరం చేయాలన్నారు. స్టేషన్ హౌజ్ మేనేజ్‌మెంట్, పోలీస్ స్టేషన్ నిర్వహణ, సెక్టార్ అధికారుల బాధ్యతలు విధిగా అమలు చేయాలని సూచించారు. పాత నేరస్తుల నివాసాలను, కదలికలను



గుర్తించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చూడాలన్నారు. పెట్రో కార్, బీట్ డ్యూటీ సిబ్బంది విధుల నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐ ఉస్మాన్ షరీఫ్, ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ భద్రాద్రి సేవలు చిరస్మరణీయం

**- అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం**



**ప్రజాపక్షం/భద్రాచలం :** గ్రీన్ భద్రాద్రి సేవలు చిరస్మరణీయం అని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య అన్నారు. స్థానిక క్రాంతి విద్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ విద్యార్ధినీ విద్యార్ధులతో కలిసి స్కూల్లో మొక్కలు నాటడం ఆనందంగా ఉందని, చాలా చెట్లు నరికివేతకు గురై భద్రాచలం కాంక్రీట్ జంగల్ మారిపోయిందని చెప్పారు. గ్రీన్ భద్రాద్రి వారు 14 సం.లుగా నిరంతరాయంగా మొక్కలు నాటుతూ వాటిని సంరక్షిస్తూ పట్టణాన్ని పచ్చని వనంగా మార్చారని చెప్పారు. రాబోయే రోజుల్లో మరిన్ని పచ్చని సేవలు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు చిట్టె లలిత, సోమరౌతు సమత, జివిస్ శంకర్రావు, కామిశెట్టి కృష్ణార్జునరావు, తిప్పన సిద్దలు, డా. విజయరావు, పరిమిశ్రీనివాస్, తమ్మళ్ల వెంకటేశ్వరరావు, వరుణ్, ఉపాధ్యాయులు. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# భాగ్యలక్ష్మీ సిసిఐ కొనుగోలు కేంద్రంలో దళారుల రాజ్యం..?

**-రైతు నేరుగా సిసిఐ కొనుగోలు కేంద్రానికి వెళ్లితే ఎన్నో ఇబ్బందులు**



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** పత్తి రైతులు ఆరుగాలం కాయకష్టం చేసి పండించిన పత్తి పంటను అమ్మేందుకు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిసిఐ కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర ప్రకటించి మేలు రకం పత్తికి రూ.8100 ధరను ప్రకటించి కొనుగోలు చేస్తుంటే అక్కడ సిసిఐ కొనుగోలు వారితో ప్రైవేట్ వ్యాపారులు దళారులు కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారు. రైతులు నేరుగా పత్తిని కొనుగోలు కేంద్రానికి తీసుకువెళ్లితే తేమ శాతం పేరుతో కొనుగోలు చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని కేశవాపురం గ్రామానికి చెందిన జక్కుల వీరన్న ఆరోపించారు. వీరన్న రైతు సుమారు 15 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేయగా వ్యవసాయ కూలీలతో కేజిలకు పత్తిని తీయించి విక్రయించేందుకు పాతర్లపాడు భాగ్యలక్ష్మి జిన్నింగ్ మిల్‌లోని సిసిఐ కొనుగోలు కేంద్రానికి తీసుకువెళ్లగా తేమశాతం ఎక్కువ ఉందనే సాకుతో ఇబ్బందులు గుర్తి చేస్తున్నారని, అదే పత్తిని ఖమ్మం మార్కెట్‌కి తీసుకువెళ్తే జెండా పాట రూ.7100 ఉండగా రూ.7వేలకు కొనుగోలు చేశారని తెలిపారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిసిఐ కొనుగోలు కేంద్రం గ్రామాల్లో రైతుల వద్ద కొనుగోలు చేసే వ్యాపారుల మేలుకే అని ఆయన ఆరోపిస్తున్నారు. రైతులు పండించిన పత్తిని సిసిఐ వారు కొనుగోలు చేయకుండా గ్రామాల్లో కొనుగోలు చేసిన వ్యాపారులతో సిసిఐ వారు కుమ్మక్కై వారి తీసుకువచ్చిన పత్తిని ఎలాంటి తేమశాతం లేదని 17శాతం వచ్చిన వారి పత్తిని కొనుగోలు చేసి అదే పత్తిని అదే భాగ్యలక్ష్మి సిసిఐ కొనుగోలు కేంద్రంలో అమ్మిన రైతులకు సిసిఐ కొనుగోలు కేంద్రం ద్వారా చెల్లించిన డబ్బులను తేమశాతం తదితర కారణాలతో కోతలు పెడుతూ రైతులను మోసం చేస్తూ వ్యాపారులు లబ్ధిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతు పండించిన పత్తి పంటను కొనుగోలు చేసే విధంగా చూడాలని అధికారులను వేడుకుంటున్నారు. ఈ విషయంపై స్థానిక పాలేరు ఎమ్మెల్యే, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, జిల్లా వ్యవసాయాధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

# పేద విద్యార్థులకు రాత పుస్తకాల పంపిణీ



**ప్రజాపక్షం/కల్లూరుః** స్ఫూర్తి ఫౌండేషన్ ఎన్నారై కడియాల శిరీష జన్మదినోత్సవం సందర్భంగా మండల ప్రజా పరిషత్ పాఠశాలలో పేద విద్యార్థులకు రాత పుస్తకాలు, ప్లేట్లు, గ్లాసులు, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు ,రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ పేద విద్యార్థుల కు వారి మధ్య ఈరోజు జన్మదినోత్సవాన్ని జరుపుకోవడం ఆనందదాయకమని ఎంతో మంది పేదలకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న ఎన్ఆర్ఐ ఫౌండేషన్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వారి ప్రతినిధులైన పరకారామారావు ను అభినందించారు. గురుకుల విశ్రాంత ఉపాధ్యాయులు ఉబ్బన నాగరాజు మాట్లాడుతూ ఎక్కడో అమెరికాలో ఉండి కల్లూరులో పేద విద్యార్థులకు పలు విధాలుగా రాత పుస్తకాలు, ఉన్నత స్థాయి చదువులకు ఆర్థికమైన సహాయం చేస్తూ ఉండటం పట్ల శిరీష, శ్రీవ్యాల్ ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు ఉబ్బన బాబురావు, జల్ది రామకృష్ణ, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, రమాదేవి, అనిత, వేణి, కేక్ కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు.

# రాష్ట్రస్థాయికి ఎంపికైన గురుకుల విద్యార్థిని



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరులోని గురుకుల కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం ఎంఈసి చదువుతున్న బొడ్డు అంబిక జిల్లా నుంచి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక జరిగింది. అండర్ 19 వాలీబాల్ రాష్ట్ర పోటీలలో జాతీయస్థాయి వాలీబాల్ జట్టుకి ఎన్నిక కావడం జరిగింది. ఈ నెల మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలలో పదో తారీకు నుండి 16వ తేదీ వరకు జరుగునున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కనకదుర్గ తెలిపారు. అంబికా ఐదవ సారి, మూడవ జాతీయస్థాయి పోటీలలో మూడు మెరిట్ సర్టిఫికేట్ పొందడం జరిగిందని ప్రిన్సిపాల్ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల సహకరించిన వ్యాయామ ఉపాధ్యాయురాలు పద్మ, పిడి త్రివేణి, కళాశాల సిబ్బంది, విద్యార్థినిని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

# ప్రమాదకర బావిని పూడ్చి వేయండి





**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని మర్లపాడు గ్రామంలో గృహాల మధ్య భావి ఉండటంతో ప్రమాదకరంగా మారింది. పొంచి ఉన్న ప్రమాదాన్ని నివారించాలని గ్రామస్తులు గ్రామపంచాయతీ కార్యదర్శిని, మండల పంచాయతీ అధికారిని, ఎంపీడీవోను, కోరుతున్నారు. 50 గృహాల మధ్య బహిరంగంగా ప్రమాదకరంగా ఉందని, డ్రైనేజీ కాలువ నీరు బావిలోకి చేరి దుర్వాసన తో పాటు దోమలు పెరిగి ఇబ్బందికరంగా ఉందని దానిని వెంటనే పూడ్చివేయడం లేదా పెన్సింగ్ తో మూత వేయడం లాంటిది చేయాలని మరల పాడు గ్రామ ఎస్సీ కాలనీవాసులు సంబంధిత అధికారులను కోరుతున్నారు. ఎన్నిసార్లు గ్రామపంచాయతీ కార్యదర్శి కి తెలియపరిచినా పట్టించుకోవడంలేదని ప్రజల ప్రాణాలను లెక్కచేయకుండా నిర్లక్ష్యంగా కార్యదర్శి ఉంటున్నారని ఈ ప్రాంతంలో నిత్యం పెద్దలు చిన్నపిల్లలు తిరుగుతూ ఉంటారని తగు జాగ్రత్తలతో దీనిపై వెంటనే గ్రామ, మండల స్థాయి, అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో చంద్రశేఖర్ ను వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శి ద్వారా వివరాలు తీసుకొని తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# టియుసిఐ రాజకీయ తరగతులను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/సత్తుపల్లిః** ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా ఖమ్మం జిల్లా రాజకీయ తరగతులు నవంబర్ 9వ తేదీన నేలకొండపల్లి మండల కేంద్రంలో వంద మందితో నిర్వహించడం జరుగుతుందని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా కోశాధికారి అమరపుడి శరత్ తెలిపారు. గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో శరత్ మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కార్మిక వర్గ కర్తవ్యాలు తదితర ఆంశాలపై టీయుసిఐ రాష్ట్ర అధ్యక్షులు కె సూర్యం ''భారత కార్మికోద్యమ చరిత్ర'' అంశాన్ని రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఎల్ పద్మ, ''టీయుసిఐ నిర్మాణం పని విధానం'' అంశాన్ని జిల్లా కార్యదర్శి జి రామయ్య బోధిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో సిహెచ్ వెంకటేష్, బి. మురళికృష్ణ, పి. వెంకటేశ్వరరావు, ఏ. శ్రీనివాస్, సత్యనారాయణ, సిహెచ్. శ్రీను తదితరులు పాల్గొన్నారు.